క్లుప్తంగా

పోలీస్ కుటుంబానికి చెక్కు అందజేత



నగరంపాలెం: ఏఆర్ ఏఎస్ఐ కుటుంబానికి లక్ష రూపాయల చెక్కుని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. ఇటీవల ఏఆర్ ఏఎస్ఐ చిలకా రత్నం మృతిచెందారు. మృతుని భార్య కరుణకు నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో అందించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అన్నివేళల్లో అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ నాగరాణి పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై దసరా మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వరరాగ సుధ ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు కేవీ సాయిబాబా శర్మ బృందం పలుభక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై ఎం.రామకృష్ణశర్మ, తబలాపై షణ్ముఖశర్మ వాయిద్యాన్ని అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

భగత్ సింగ్ విద్యార్థులకు ఆదర్శం

ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎన్. భావన్నారాయణ



లక్ష్మీపురం: భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎన్.భావన్నారాయణ కోరారు. పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే పవన్ కుమార్, షేక్ సమీర్, జిల్లా సహాయ కార్యదర్శులు యశ్వంత్, సౌమ్య, కమిటీ సభ్యులు అమృత వర్షిని, సంతోష్ యుగంధర్, సుర్జిత్, భవిత, గంగాధర్,నవీన్, ఉన్నతి పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా బలోపేతానికి కృషి చేయాలి



గుంటూరు మెడికల్: ఎస్టీ మోర్చా బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు కోరారు. లాల్‌పురం రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. రాజారావు మాట్లాడుతూ చైతన్యవంతుల్ని గుర్తించి వారిని పార్టీలోకి ఆహ్వానించాలని సూచించారు. ఎస్టీల సమస్యలను గుర్తించి వారికి అండగా ఉంటూ ఆ శాఖలకు సంబంధించిన అధికారులను కలిసి ఆయా సమస్యలకు పరిష్కార చూపాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి తపన చౌదరి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఎస్టీలకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, గిరిజన మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ దేవ సోత్ వెంకటేశ్వర్ల నాయక్, శ్రీను నాయక్ సురేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ పాల్గొన్నారు.

బంగారం తీసుకుని తిరిగి ఇవ్వని మహిళపై కేసు

లక్ష్మీపురం: శుభకార్యానికి వెళ్లేందుకు స్నేహితురాలి వద్ద ఉన్న 20 సవర్ల బంగారు ఆభరణాలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా వేధిస్తున్న మహిళపై పట్టాభిపురం పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. విద్యానగర్ ఒకటో లైన్‌కు చెందిన మెట్ల ఉమాదేవి, పలకలూరు రోడ్డు ప్రాంతానికి చెందిన వాసిరెడ్డి ప్రసన్న రాధిక మంచి స్నేహితులుగా ఉన్నారు. అయితే రెండు నెలల క్రితం వాసిరెడ్డి ప్రసన్న రాధిక ఓ శుభకార్యానికి వెళ్తూ స్నేహితురాలైన మెట్ల ఉమాదేవి వద్ద ఉన్న 20 సవర్ల బంగారు ఆభరణాలు తీసుకుంది. అయితే శుభకార్యం పూర్తి అయి రెండు నెలలు అవుతున్న తీసుకున్న బంగారు ఆభరణాలు వాపసు ఇవ్వక పోగా ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో మెట్ల ఉమాదేవి దిక్కుతోచక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంపత్‌నగర్ పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు వీణ శారదా అలంకారం



బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో సరస్వతీ దేవిగా..



అరండల్‌పేట లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సరస్వతీ దేవిగా..



బ్రాడీపేట 2/14లోని శంకరమందిరంలో అమ్మవారికి సరస్వతీ దేవిగా..



మల్లారెడ్డినగర్ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో సరస్వతీదేవిగా..

సరస్వతీదేవీగా అమ్మవారు



రెడ్లబజారు శ్రీకనక దుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీ దేవిగా అలంకరణ



విద్యానగర్ 3వలైను శ్రీసాయినాథ సన్నిధానంలో అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ



మల్లికార్జునపేట శివాలయంలో సరస్వతీదేవి అలంకారం



వికాస్‌నగర్ 11వలైను షిరిడిసాయి మందిరంలో అమ్మవారికి సరస్వతీదేవిగా అలంకరణ



మారుతీనగర్ శ్రీకంచికామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయంలో అమ్మవారు సరస్వతిదేవిగా..

నగరంపాలెం: శ్రీదేవి శరన్నవరాత్రులు నగరంలోని దేవాలయాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం 8వ రోజు చేరాయి. పలు దేవాలయాల్లో అమ్మవారి సరస్వతీ దేవిగా దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సరస్వతీదేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా నాయుడుపేటలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

నకిలీ బంగారం ఇచ్చి రూ.12 లక్షల టోకరా

లక్ష్మీపురం: బంగారం పేరుతో మహిళను నమ్మించి రూ.12 లక్షలు టోకరా వేసిన ఘటనపై పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలలలు.. అరండల్‌పేటకు చెందిన పఠాన్ గాలి షాహిద్, ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. ఓ గుర్తు తెలియని వ్యక్తి గాలి షాహిద్ భార్యకు ఫోన్ చేసి గతంలో పరిచయాలు ఉన్నట్లు నమ్మించాడు. గాలిషాహిద్ భార్యకు గీతా, రవి వారి తాతా ఇల్లు వర్షాకాలంలో వర్షాలకు పడిపోయిందని, పునాది కోసం మూడు అడుగులు గోయి తవ్వినప్పుడు బంగారం దొరికిందని, ప్రభుత్వానికి తెలిస్తే దొరికిన బంగారాన్ని స్వాధీన పరుచుకుంటారని నమ్మబలికాడు. తక్కువ ధరకే బంగారం ఇచ్చే విధంగా మాట్లాడుకున్నారు. నమ్మించేందుకు దొరికిన బంగారాన్ని సెల్‌ఫోన్‌లో ఫొటోలు పెడుతున్నట్లు చెప్పారు. కర్ణాటక రాష్ట్రం హొస్‌పేట్, కుద్దీల్ గ్రామానికి రండి అక్కడికి వచ్చిన తరువాత బంగారం ఇస్తామని, దానిని బంగారం వ్యాపారి వద్ద పరిశీలించుకోవాల్సిందిగా కోరాడు. రూ.12 లక్షలు ఇస్తే అర కిలో బంగారం అని చెప్పి నమ్మించారు. దీంతో బాధితులు ఈనెల 7వ తేదీన కర్ణాటక రాష్ట్రం హొస్‌పేట్, కుద్దీల్ గ్రామానికి వెళ్లగా ఫోన్‌లో మాట్లాడిన గీత, రవితో పాటు బంగారం ఉన్న వ్యక్తి వారి తాతా అని చెప్పి బాధితులకు 0.800 మిల్లి గ్రాముల బంగారం చిన్న ముక్కను ఇచ్చి దానిని పరిశీలించుకుని రావల్సిందిగా చెప్పారు. మీకు నమ్మకం కుదిరి తాము ఇచ్చిన బంగారం ముక్క నిజమైన బంగారం అయితే రూ.12 లక్షలు తీసుకుని వస్తే అర కిలో బంగారం ఇస్తామని సూచించారు. దీంతో బాధితులు బంగారం ముక్కను తీసుకుని గుంటూరు వచ్చి బంగారం దుకాణంలో పరిశీలించుకోగా బంగారం అని తేలింది. దీంతో ఈనెల 13వ తేదీన బంధు మిత్రుల వద్ద రూ.12 లక్షల అప్పు చేసి బంగారం తీసుకున్నారు. గుంటూరు వచ్చి వాటిని పరిశీలించగా రాగి జింక్ మిశ్రమలతో కూడిన నకిలీ బంగారం వస్తువులుగా నిర్ధారించుకున్నారు. దీంతో తక్షణమే బాధితులు వారికి ఫోన్ చేయగా వారి నంబర్లు స్విచ్ ఆఫ్ అని వస్తున్నాయి. అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ!

పట్నంబజారు: వస్త్ర దుకాణానికి వచ్చి చీరలు దోచుకుపోయిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. స్థానిక వ్యాపారులు తెలిపిన వివరాలు.. రాధాకృష్ణా థియేటర్ సెంటర్(ఆర్కేటీ) వద్ద ఒక భారీ వస్త్ర దుకాణం ఉంది. అయితే సోమవారం రాత్రి కొంత మంది మహిళలు వచ్చి బేరాలాడుతూ.. సుమారు 30 చీరలకుపైగా దోచుకుపోయారు. మహిళలు వెళ్లిపోయిన కొద్దిసేపటికే గమనించిన నిర్వాహకులు పోలీసులు ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

నెహ్రూ నగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగర పాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్ వంటి వేదికలకు వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. నగర పాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్ లో పీజీఆర్ఎస్ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 27 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో మేయర్ పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుంచి 31 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 10, ఇంజినీరింగ్ విభాగానికి 11, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ(ఇన్‌చార్జి) సుందరరామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న మేయర్ రవీంద్ర, అడిషనల్ కమిషనర్ చల్ల ఓబులేసు

పేద ప్రజల సంక్షేమం కోసమే జీఎస్టీ 2.0

నెహ్రూ నగర్: పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసమే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 ను ప్రవేశ పెట్టిందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జీఎస్టీ 2.0పై నగర పాలక సంస్థ అధికారులు సిబ్బంది సచివాలయాల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్టీ డెప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ అనసూయ, నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందరామి రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధులను నియంత్రించాలని సీపీఐ ధర్నా

నెహ్రూ నగర్: నగరంలో విజంభిస్తున్న డయేరియా, కలరా వ్యాధులను నియంత్రించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు నగరంలో డయేరియా, కలరా వ్యాధులు ప్రబలడానికి కారణం కలుషిత నీరు, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరి ప్రధాన కారణాలని విమర్శించారు. సురక్షిత మంచినీరు అందించకుండా వాటికి తగు చర్యలు తీసుకోకుండా రోడ్ల పైన చిరు వ్యాపారులను ఖాళీ చేయిస్తూ వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ కూటమి పాలకులు, మున్సిపల్ యంత్రాంగ అసమర్థతతో ఈ విధమైనటువంటి పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నగర కమిటీ సభ్యులు రావుల అంజిబాబు, మంగ శ్రీనివాసరావు, గుండెబోయిన లక్ష్మి, దేవా నాయక్, సురేష్ బాబు, విరిగినేని వెంకటేశ్వర్లు, బి. వెంకటేశ్వర రెడ్డి, జంగాల చైతన్య, ధూపాటి వెంకటరత్నం, నగర సమితి సభ్యులు ఆకిటి రామచంద్రుడు, జగన్నాథం, వలి,బన్ని, రాంప్రసాద్,బాబర్, తిరుమల, రెడ్డయ్య, రాయల వెంకటేశ్వర్లు, ఆర్టీసీ రాజు, పూర్ణ, ఖాన్, రాగం నాగరాజు, ఖాసీం, శివమ్మ, త్రినాథ్, పీరా, వేగయ్య, అజయ్, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఉపా సెల్ పీఓగా సింహాచలం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఉపా సెల్ పీఓగా(ప్రాజెక్టు ఆఫీసర్) డి.సింహాచలంను నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దర్జాగా దోపిడీ

- అడ్డగోలు నిబంధనల ఉల్లంఘన
- ఎమ్మార్పీ పట్టదు.. నాసిరకం వస్తువులు..
- వాటర్ బాటిళ్లపైన వారికి ఇష్టమైన రేట్లు.. అవి లోకల్ బ్రాండ్‌లే
- మామూళ్ల మత్తులో ఆర్టీసీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు
- ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణదారుల నిర్వాకం



ఎమ్మార్పీల కంటే అధికంగా విక్రయిస్తున్న బస్టాండ్లోని ఓ దుకాణం

పట్నంబజారు: దర్జాగా దోపిడీ చేస్తున్నారు.. అడ్డగోలు అమ్మకాలు జరుపుతున్నారు... ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు.. విక్రయించకూడని వస్తువులు విక్రయాలు చేస్తున్నారు.. ఇదేమని ప్రశ్నించే అధికారి లేడు.. దుకాణదారుడి జేబు నిండితేనే.. అధికారి జేబు నింపేది.. అందుకే కళ్లు మూసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.. ఇదంతా ఎక్కడో కాదు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో నిత్యం జరిగే తంతు.

దసరా నేపథ్యంలో నిత్యం మరో 50 వేల నుంచి 70 వరకు అధికంగా ప్రయాణికులు పెరగటంతో బస్సుల్లో ఖాళీలు కూడా లేకుండా కిటకిటలాడుతూ.. దర్శనమిస్తున్నాయి. ఇదే అదునుగా ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణదారులు దోపిడీకి తెరదీశారు. బస్టాండ్ డిపోల 1, 2లలో కలిపి మొత్తం 70కిపైగా దుకాణాలు ఉంటాయి. బస్టాండ్‌లో ఉన్న దుకాణాల్లో 40కిపైగా దుకాణాల తినుబండారాలు విక్రయిస్తున్నారు. వాటిల్లో కనీసం ఎమ్మార్పీలు లేని వస్తువులు విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గొట్టాల ప్యాకెట్లు, రింగ్ చిప్స్, పాప్‌కార్న్‌తో పాటు అనేక వస్తువులపై ఎమ్మార్పీ, కాలపరిమితి ఏ మాత్రం కనపడదు. 100 గ్రాములు పాప్‌కార్న్ ప్యాకెట్ రూ.50, చిప్స్ ప్యాకెట్ ఎమ్మార్పీ లేకపోయినా.. రూ.50, గొట్టాల ప్యాకెట్ రూ.40, బయట నుంచి తీసుకుని వచ్చిన సమోసా ఒక్కటి రూ.10, ప్రతి కూల్ డ్రింక్ పైన రూ.10 నుండి 20 వరకు అదనంగా తీసుకుంటున్నారు. ఈ విధంగా తీసుకుంటున్నా.. అధికారులు ఫిర్యాదులు అందుతున్నా.. పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

ఎమ్మార్పీలు ముద్రించి మరీ..

ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక విచిత్ర వాతావరణం నెలకొంది. వాటర్ బాటిళ్లు పెద్ద కంపెనీలు అయిన కిన్‌లీ, బిస్లరీ, బెయిలీ వంటివి ఇక్కడ విక్రయించరు. పలు లోకల్ కంపెనీలు అయిన ఆక్సిజమ్, ఆక్వాజెన్ అనే బాటిళ్లపై రూ.30 ఎమ్మార్పీ ముద్రించి ఉంటుంది. ఈ క్రమంలో వాటిని అడ్డుఅదుపు లేకుండా రూ.40కి విక్రయిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. డిపో 2లో ఉన్న మినరల్ వాటర్ దుకాణంలో 800 ఎంఎల్ వాటర్ బాటిళ్లలో నీటిని నింపి, అక్కడ నీరు తాగితే రూ.8, బాటిల్ ఎటువంటి సీల్ కానీ, ముద్రణ కానీ ఉండని వాటిని రూ.20 విక్రయిస్తున్నా.. అధికారులు నీళ్ళునిములుతున్నారు. బూజు పట్టిన పాలకోవాలు.. చీమలు పట్టిన పూతరేకులు.. ఎక్స్పైరీ తుడిపేసిన ఓఆర్ఎస్‌లు కూడా విక్రయిస్తున్నారంటే బస్టాండ్‌లో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఫిర్యాదు అంటే భయమే లేదే....

ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మార్పీల విషయంలో నిత్యం ప్రయాణికులు, దుకాణదారులకు మధ్య ఘర్షణలు నిత్యకృత్యమే. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ.. కనీసం పట్టించుకోకపోగా, ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే.. వారు రాసే కేసులు రూ.500 మాత్రమే. దీనితో దుకాణదారుల్లో భయం లేకుండా పోయింది.

> **తనిఖీలు నిర్వహిస్తాం**
>
> ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాలపై అధికారులతో తనిఖీలు చేయిస్తాం. అధిక రేట్లకు విక్రయించినా... నాణ్యత లేని వస్తువులు విక్రయించినా చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా ప్రతి దుకాణదారుడికి ఆదేశాలు జారీ చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించబోం.
>
> – సీహెచ్ విమల, ఆర్ఎం, ఆర్టీసీ, గుంటూరు

వేద వారాహి ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ అభివృద్ధికి కృషి

తులసి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు



కొరిటెపాడు(గుంటూరు): వేద వారాహి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దిన దినాభివృద్ధి చెందాలని తులసి గ్రూపు సంస్థల చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు ఆకాంక్షించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వేద వారాహి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన వ్యాపార సంస్థను స్థానిక మంగళగిరి రోడ్ లోని సీతారామనగర్ 1వ లైన్‌లో సోమవారం ప్రారంభించారు. రామచంద్ర ప్రభు మాట్లాడుతూ పవర్‌కేర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సహకారంతో వేద వారాహి ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ సంస్థ పనిచేస్తోందని తెలిపారు. యువత ఉద్యోగాల వేటలోనే కాదని, కొత్తగా ఆలోచించి నూతన సంస్థలు స్థాపించాలని సూచించారు. పవర్‌కేర్ సొల్యూషన్స్ లిమిటెడ్ నిర్వాహకుడు ఎం.డి.కన్నన్ మాట్లాడుతూ వేద వారాహి ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ద్వారా ఆధునిక సాంకేతికతతో కూడిన అనేక రకాల జనరేటర్‌లకు స్పేర్ పార్ట్స్, సర్వీస్, ఏఎంసీ అందించడం సంస్థ లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధికే జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

లక్ష్మీపురం: సామాన్య కుటుంబాల ఆర్థిక అభివృద్ధికే ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు అని తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అన్నారు. రాష్ట్ర జీఎస్టీ అధికారులతో కలిసి నగరంలోని లాలాపేట మార్కెట్‌లో పలు దుకాణాలను సోమవారం సందర్శించారు. దుకాణదారులతో ముఖాముఖి మాట్లాడి అవగాహన కల్పించారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీతా మాధురి మాట్లాడుతూ దసరా నుంచి దీపావళి వరకూ ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ డెప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాస్, సహాయ కమిషనర్లు వెంకటేశ్వరరావు, ఆర్.అనసూయ, మల్లికార్జున, శ్రీధర్ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ పూరిల్లు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైన ఘటన చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన బి.నాగిరెడ్డికి చెందిన పూరిల్లు ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని పూర్తిగా కాలి బూడిదైంది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. నాగిరెడ్డి కుటుంబసభ్యులు కొంత కాలంగా ఇక్కడ నివసించటం లేదని బంధువులు తెలిపారు. రెవెన్యూ అధికారులు ప్రమాదానికి గల కారణాలు, నష్ట అంచనాలను నమోదు చేసుకున్నారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.